24గంటల్లో విధుల్లో చేరకుంటే
క్రమశిక్షణ చర్యలు

» ఉత్తర్వులు జారీ చేసిన దేవస్థానం ఈవో

భద్రాచలం అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పరిపాలన సౌలభ్యం కోసం ఈనెల 13న చేసిన అంతర్గత బదిలీల్లో భాగంగా 24 గంటల్లో సంబంధిత ఉద్యోగులు వారికి కేటాయించిన విభాగంలో జాయిన్ అయ్యి.. జాయినింగ్ రిపోర్టు సమర్పించాలని దేవస్థానం ఈవో కే దామోదర్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఉద్యోగుల విధుల్లో మార్పులు చేసినా ఉద్యోగులు నూతన విభాగాల్లో జాయినింగ్ రిపోర్టు సమర్పించకపోవడంతో ఈ హెచ్చరిక ఉత్తర్వులను జారీ చేసినట్లు తెలుస్తోంది. ఉత్తర్వులు అందిన 24 గంటల్లో నూతన విభాగాల్లో చార్జీ పొంది సంబంధిత (మిగతా 6వ పేజీలో)

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
బుధవారం 15 అక్టోబరు 2025

తెలంగాణ జరూర్ ఆనా..



రిపోర్టు చేస్తున్న టూరిజం పోలీసులు

పర్యాటకులకు అండగా
టూరిస్ట్ పోలీస్

» జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న పది మంది
» నేటినుంచి విధుల్లోకి సిబ్బంది
» రక్షణ, భద్రత కల్పించడంతో పాటు భరోసాగా..
» జిల్లా ఇన్‌చార్జ్‌కు రిపోర్టు చేసిన శిక్షణ పోలీసులు

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో పర్యాటక రంగమే రాష్ట్రంలో ప్రధాన ఆదాయ వనరుగా రూపుదిద్దుకుంటోంది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేపట్టి అందుకు అనుగుణంగా దేశ, విదేశాల నుంచి తరలివచ్చే పర్యాటక అతిథులకు తెలంగాణ జరూర్ ఆనా (తెలంగాణకు తప్పక రండి) అనే నినాదంతో ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటక అతిథులు రక్షణ, భద్రత

మిగతా 6లో..

జై శ్రీరామ్
జై జై శ్రీరామ్

» భద్రాద్రిలో సంప్రదాయబద్ధంగా గిరి ప్రదక్షిణ
» అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

6



భద్రగిరి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న మహిళా భక్తులు




ఆ మంతనాల వెనుక
మతలబు ఏంటో ?

» ఏపీకి చెందిన ఓ ఎమ్మెల్సీ స్టిక్కరు ఉన్న కారులో పలువురు వీఐపీల రాక
» ఆ రెండు కీలక శాఖల అధికారులతో గంటల కొద్దీ మంతనాలు
» అశ్వారావుపేటలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఘటన

అశ్వారావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)

"ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వీఐపీ స్టిక్కరుతో ఉన్న కారులో కొందరు వ్యక్తులు అశ్వారావుపేటకు వచ్చి రెండు కీలక శాఖల అధికారులతో గంటలకొద్దీ మంతనాలు జరిపి వెళ్లి ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలో చర్చనీయాంశంగా మారిన ఈ మంతనాల వెనుక మతలబు ఏమై ఉంటుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా కనిపిస్తోంది."



ప్రజాస్వామ్యంలో ఎక్కడి వారైనా ఎక్కడికైనా వెళ్లొచ్చు. ఎవరితోనైనా కలవొచ్చు.. చర్చించవచ్చు కూడా..! ఇది పెద్ద తప్పేమీ కాదు. కానీ తెలంగాణ, ఏపీలో ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు, ఏపీ నుంచి తెలంగాణలోకి వివిధ రకాల పేరుతో జరుగుతున్న దందాలకు, అక్రమ వ్యాపార లావాదేవీలకు అశ్వారావుపేట ప్రధాన మార్గంగా ఉంది. నిత్యం కోట్లాది రూపాయల లావాదేవీలు ఈ ప్రాంతం మీదుగానే జరుగుతుంది. ఇవన్నీ హై ప్రొఫైల్ కలిగిన వ్యక్తులు, పరపతి అండదండలతోనే జరుగుతుందనేది బహిరంగ రహస్యమే. ఈ మొత్తం కార్యక్రమాలకు తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లాలన్నా.. ఏపీ నుంచి తెలంగాణలోకి రావాలన్నా.. ఈ ప్రాంతంలోని పలు శాఖల అధికారులు, కీలక వ్యక్తుల సహకారం తప్పనిసరి. వారి కార్యకలాపాలకు ఆటంకం లే కుండా ఉండేందుకు ఏపీకి చెందిన వ్యక్తులు లక్షలాది రూపాయలను చిల్లర పైసల్లా ఖర్చు పెడుతుంటారు. ఇందుకోసం ఈ ప్రాంతంలో రాజకీయ సంబంధాలు, బంధుత్వాలు, స్నేహాలు, అధికారులు, ముఖ్యమైన వ్యక్తుల తో మంచి అనుబంధాలను కొనసాగిస్తుంటారు. అశ్వారావుపేట మీదుగా గంజాయి, బియ్యం, అనుమతుల్లేని రసాయన పదార్థాలు, పన్నులు చెల్లించని పలు రకాల వ్యాపార సామగ్రి, ఇసుక వంటి వ్యాపార లావాదేవీలు జరుగుతూనే ఉంటాయి. కోడి పందేలు, జూదం, బెట్టింగ్‌ల వంటి అనేక రకాలైన లావాదేవీలు ఏపీ, తెలంగాణ ప్రాంతాలకు చెందిన వారు అటు వైపు వారు ఇటు, ఇటువైపు వారు అటు నిత్యం సంబంధాలు కలిగి ఉం టారు. అందుకే ఈ ప్రాంతంలో పనిచేసిన అధికారులు.. ఏపీకి చెందిన ప్రముఖులు, వివిధ వ్యాపార లావాదేవీలు కలిగిన వ్యక్తులతో అత్యంత సన్నిహిత సంబంధాలు నెరుపుతుండడం ఆది నుంచి ఆనవాయితీగానే ఉంటుంది. అయితే ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకు అంటారా? అక్కడకే వస్తున్నాం..! సుమారు 10రోజుల క్రితం ఏపీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి స్టిక్కర్ వేసుకున్న ఓ కారులో కొందరు ఆ ప్రాంతానికి చెందిన ముఖ్యులు అశ్వారావుపేటకు వచ్చారు. ఆ వీఐపీలు రెండు ప్రధాన శాఖలకు చెందిన అధికారులతో గంటల కొద్దీ మంతనాలు జరిపి వెళ్లినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసలు ఆ మంతనాలు వెనుక అం తర్యమేమిటీ? సొంత అవసరాలా? లేక ఇతర వ్యాపార లావాదేవీలా? ఇప్పటికే అశ్వారావుపేట మీదుగా జరుగుతున్న అనేక లావాదేవీలను షురూ చేసుకునేందుకా!? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పట్టణంలో ఇప్పుడు ఎక్కడ చూసినా.. ఈ అంశంపైనే చర్చలు జరుగుతున్నాయి. వచ్చిన ఆ వీఐపీలు ఎవరు? ఏ పనికోసం వచ్చారు? వచ్చిన వారు ఆ శాఖల అధికారులతోనే ఎందుకు మంతనాలు జరిపారు !? అన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. మంతనాలు జరిపిన వారందరిపై తప్పుగా మాట్లాడలేము.. కానీ కొద్ది నెలలుగా అశ్వారావుపేట పరిసరాల ప్రాంతాలలో జరుగుతున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో ప్రజలలో పలు రకాల అపోహలు కలగడం మామూలే. కానీ అసలు ఏమి జరిగిందనేది ఇద్దరి మధ్యే జరిగిన విషయాలు కాబట్టి నిజంగా ఏమి జరిగిందో ఎవరూ చెప్పలేరు. నిజం నిలకడ మీద తెలుస్తుంది. అంతా మంచే జరుగుతుందని ఆశించడం తప్పా.. ప్రజలు చేయగలిగిందేమీ లేదు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

'పది' ఫలితాల్లో వంద శాతం
ఉత్తీర్ణత తప్పనిసరి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం పాత కొత్తగూడెంలోని ఆనందఖని ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో జిల్లా స్థాయి ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల పర్యవేక్షణ పారదర్శకంగా నిర్వహించాలని, కేవలం నివేదికలకే పరిమితం కాకుండా తగిన సూచనలు సలహాలు కూడా ఇవ్వాలన్నారు. ప్రతీ పాఠశాల పర్యవేక్షణ అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతీ నెల పాఠశాలలో (మిగతా 7వ పేజీలో)

ప్రభుత్వ స్థలాల్లో
పామాయిల్



● ఖాళీ జాగాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటడంపై ఉద్యానశాఖ దృష్టి

» పచ్చదనంతో పాటు ఆదాయం సమకూరేలా ఆలోచన
» మంత్రి తుమ్మల సూచనలతో కార్యాచరణ రూపొందిస్తున్న అధికారులు
» విధి విధానాల కోసం ఎదురుచూపు

ఖమ్మం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా.. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఏటా హరితహారం, వనమహోత్సవం ఇలా పలు పేర్లతో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రూ.కోట్లు ఖర్చుచేసి ప్రభుత్వ స్థలాలు, రహదారుల వెంట పెద్దఎత్తున మొక్కలు నాటడం ఒక తంతుగా సాగుతూ వస్తుంది. గతంలో ఖాళీ స్థలాల్లో, పొలాల గెట్ల వెంట తాటి, ఈతచెట్లు ఉండేవి. ఇవి కనుమరుగవుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈసారి వినూత్నంగా ఆలోచించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలోచనతో ప్రభుత్వ స్థలాలు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, బీడు భూముల్లో పెద్దఎత్తున ఆయిల్‌పామ్ మొక్కలుపెంచి అటు పచ్చదనంతో పాటు ఇటు ఆదాయం పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను మోడల్‌గా ఎంపిక చేసి.. నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, విద్యా, రెవెన్యూ, దేవాదాయ, అటవీ తదితర శాఖలకు సంబంధించిన ఖాళీ భూములను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో పాలేరు నుంచి కల్లూరు వరకు ఎన్నెస్పీకి ప్రధాన కాలువ వెంట ఇరువైపులా ఖాళీస్థలాలున్నాయి. దీనికితోడు గతంలో ఎన్నెస్పీ క్వార్టర్స్ నిర్మాణం తదితర అవసరాల నిమిత్తం పెద్దఎత్తున భూములు ఖాళీగా ఉన్నాయి. ఇవి చాలావరకు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఆక్రమణకు గురవుతున్నాయి. సీతారామ ప్రాజెక్టు ద్వారా అశ్వాపురం నుంచి పాలేరు వరకు ప్రాజెక్టు కాలువ 130కి.మీ.పైగా నిర్మాణం జరిగింది. ఇటు ఎన్నెస్పీ, సీతారామ ప్రధాన కాలువలతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ కూడా ఉన్నాయి. అలాగే ఇరిగేషన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో పలు ప్రాజెక్టులు, చెరువులు కూడా ఉన్నాయి. ఇలా ఇరిగేషన్ చెరువు కట్టలు, ప్రాజెక్టుల పక్కన ఖాళీ భూముల్లోనూ ఆయిల్‌పామ్ మొక్కలు వేసేందుకు కసరత్తు జరుగుతోంది. అలాగే జిల్లాలో సూర్యాపేట-ఖమ్మం, ఖమ్మం-దేవరపల్లి (మిగతా 6వ పేజీలో)

ఇంకా విధి విధానాలు రాలేదు

ఎంపీ మధుసూదన్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి

ప్రభుత్వం ఖాళీ స్థలాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేయించేందుకు ఆయాశాఖల స్థలాలు గుర్తించాలని నిర్ణయించింది. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఖాళీ స్థలాల ఎంపిక, ఆయిల్ పామ్ మొక్కలు వేయించడం, వాటి పర్యవేక్షణ, డ్రిప్, సోలార్ విద్యుత్ మోటార్ల ఏర్పాటు లాంటి అంశాలపై ఇంకా విధి విధానాలు రాలేదు. అవి రాగానే కార్యాచరణ చేపడతాం. ప్రభుత్వ ఆలోచన ప్రకారంగా ప్రభుత్వ శాఖల ఖాళీభూముల్లో ఆయిల్‌పామ్‌మొక్కలు వేయడం ద్వారా పచ్చదనంతోపాటు ప్రతీ మొక్క ద్వారా ఏటా ఆదాయంతో పాటు అనేకమందికి ఉపాధి కూడా చూపిస్తుంది.

సమ్మె మరింత
ఉధృతం



» డైలీవేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాల్సిందే..
» లేకుంటే మున్ముందు మరిన్ని ఆందోళనలు
» సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

7

ఐటీడీఏ ఎదురుగా గల దీక్షా శిబిరంలోనే నిద్రిస్తున్న డైలీవేజ్ కార్మికులు

22న స్థంభాద్రి నృసింహుడి గిరిప్రదక్షిణ

- ముందస్తు ప్రకటన విడుదల చేసిన ఈవో
- గతంలో సమాచారం లేక తగ్గిన భక్తుల సంఖ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్వయంభు దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ఖమ్మంలోని స్థంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి (గుట్ట) గిరి ప్రదక్షిణను ఈనెల 22న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో, దేవాదాయ శాఖ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే ప్రతీ నెల స్వామి వారి జన్మ నక్షత్రం రోజున నరసింహస్వామి వారి గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. కానీ గత రెండు, మూడు నెలలుగా కనీస సమాచారం ఇవ్వకపోతుండటంతో భక్తుల రాక తగ్గింది. ముఖ్యంగా గతనెల 25న జరిగిన వేడుకకు భక్తులు రాకపోవడంపట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తమైంది. ఈవో, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెల నెల గిరి ప్రదక్షణకు భక్తుల సంఖ్య తగ్గుతోందంటూ 26వతేదీన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఈనెల 22న జరగబోయే గిరి ప్రదక్షణకు సంబంధించి వారం ముందుగానే భక్తులకు సమాచారం అందిస్తూ ఆలయ ఈవో జగన్‌మోహన్‌రావు వీడియో ప్రకటన విడుదల చేశారు. అయితే సోషల్‌మీడియాలో చేస్తున్న ఈ ప్రచారానికి తోడు నగరంలోని వివిధ ఆలయాలు, నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రచార పోస్టర్లు పెట్టగలిగితే భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. ఇక అయ్యప్ప మాలధారణ తీసుకుంటున్న భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ సారి గిరి ప్రదక్షణలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరగనున్నట్టు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో అయ్యప్ప స్వాములకు భిక్ష నిర్వహిస్తున్న కేంద్రాలు, ఆలయాలతో పాటు శ్రీనివాసనగర్, బైపాస్‌రోడ్ అయ్యప్ప ఆలయాల వద్ద సమాచారం అందించాలని పలువురు కోరుతున్నారు.

జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్

- భద్రాద్రిలో సంప్రదాయబద్ధంగా గిరి ప్రదక్షిణ
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



భద్రగిరి ప్రదక్షిణ అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులు

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరామచంద్రుని జన్మనక్షత్రం.. పునర్వసును పురస్కరించుకొని కొత్తగూడెం భక్తరామదాసు ట్రస్టు ఆధ్వర్యంలో భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం సహకారంతో మంగళవారం భద్రగిరి ప్రదిక్షణను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తరామదాసు వారసులు, భక్తరామదాసు ట్రస్టు నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు సీతారామచంద్రలక్ష్మణస్వామి చిత్రపటాన్ని చేత పట్టుకోగా.. దేవస్థానం అదర్వ వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ఏఈవో శ్రావణ్ కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, విశ్రాంత వేద పండితులు చిట్టి హనుమత్‌శాస్త్రి తదితరులు ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్' అన్న భక్తుల రామనామస్మరణతో భద్రగిరి మారుమోగింది. రామాలయానికి చేరుకున్న అనంతరం దేవస్థానం అదర్వ వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ భద్రగిరి ప్రదిక్షణ నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమని తెలిపారు. ఇదిలా ఉండగా కొద్ది కాలంగా పునర్వసు నక్షత్రం రోజున రామ భక్తులు భద్రగిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు.



తొలి మంచు కురిసె..

శీతాకాలం సమీపిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పొగ మంచు కమ్మేసింది. ముఖ్యంగా నగరంలో రోడ్లపై మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. అయితే ఈ సీజన్‌లోనే 'తొలి'సారి మంచుకురవడంతో పర్యావరణ ప్రేమికులు ఫొటోలను ఫోన్‌లలో బంధించారు.

● ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



రైల్వేలైన్‌తో గిరిజన గ్రామం కనుమరుగు

- ఉన్న ఒక్క ఇంటికి రహదారి, తాగునీరు, విద్యుత్ బంద్
- పగలు ఇంట్లో... రాత్రుళ్లు పక్క గ్రామంలో రాందాస్ కుటుంబం
- జర్పులా తండా, చిమ్నాతండా వాసులకు తప్పని తిప్పలు

చంద్రుగొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రైల్వేలైన్ నిర్మాణం కారణంగా చిమ్నా తండా అనే గిరిజన గ్రామం కనుమరుగైంది. ఫలితంగా ఆగ్రామంలో బాదావత్ రాందాస్ కుటుంబం మాత్రమే మిగిలింది. ఆ ఇంటికి రహదారి, తాగునీరు, విద్యుత్ బంద్ అయ్యాయి. అంతే కాకుండా పక్కనే ఉన్న మరో గిరిజన గ్రామం జర్పులా తండా వాసులను కూడా సమస్యలు వెంటాడుతున్నాయి. రైల్వే శాఖ ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించి చేతులు దులుపుకోగా, గ్రామంలో మౌలిక వసతులను పునరుద్ధరణ పనులు చేపట్టకుండా వివిధ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తిట్లు వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా చిమ్నా తండాలో వేర్వేరు కారణాలతో పలువురు గ్రామాన్ని వదిలి వేరే గ్రామాలకు వెళ్లిపోయారు. రెండు గ్రామాలకు తాగునీరు అందించే హెడ్ వాటర్‌ట్యాంకు పరిహారంలో భాగంగా రైల్వే అధికారులు రూ.20లక్షల కుపైగా ఆర్‌డబ్ల్యూ శాఖకు పరిహారం అందించారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం ఆ నిధులతో జర్పులా తండాలో చిన్నపాటి ప్లాస్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఆ ట్యాంకుతో గ్రామానికి సరిపడా నీరు అందడంలేదని గ్రామస్థులు తెలిపారు. ఒక పక్క సౌకర్యాలు లేమితో మరో పక్క గూడ్స్ ధ్వనితో గ్రామంలో ఉండలేక పోతున్నామని గ్రామస్థులు పలువురు ఆవేదన చెందుతున్నారు.

అమలు కానీ తహసీల్దార్ హామీ

రైల్వేలైన్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారికి చెల్లించినట్లు తనకు పరిహారం చెల్లించాలని రాందాస్ రైల్వే అధికారులను కోరాడు. తమ ప్లాన్‌లో నీ ఇల్లు లేదని పరిహారం ఇవ్వటం కుదరదని రైల్వేఅధికారులు తెలిపారు. దాంతో రాందాస్ కుటుంబం గ్రామస్థులతో కలిసి పనులు అడ్డుకున్నాడు. దాంతో తహసీల్దార్ సంధ్యారాణి గ్రామానికి చేరుకొని రైల్వేఅధికారులతో చర్చించారు. అందరికి ఇచ్చినట్లే పరిహారం ఇప్పిస్తానని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించాడు. ఆరు నెలలు దాటినా పరిహారం రాలేదని బాధిత కుటుంబ సభ్యులు రాందాస్, చిన్నా తెలిపారు. పగలు సౌకర్యాలు లేని ఇంట్లో ఉంటూ రాత్రుళ్లు పక్క గ్రామం జర్పులా తండాలోని బంధువుల తలదాచుకుంటున్నట్లు బాధితుడు రాందాస్ తెలిపాడు.



జర్పులాతండాలో అధికారులు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్



చిమ్నాతండా గ్రామంలో మిగిలిన రాందాస్ ఇల్లు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

కొణిజర్ల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్-14 కబడ్డీపోటీలలో తనికెళ్లసమీంలో గల వైరా ఎంజేపీ జ్యోతిరావుపులే గురుకుల పాఠశాల విద్యార్థులు అన్ని స్థాయిల్లో ప్రతిభ చూపారు. అండర్- 14 కబడ్డీ విభాగంలో ఏ.మనోజ్, పి.బాబు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈవిద్యార్థులను ప్రిన్సిపాల్ బొడ్డు నాగమణి, ఏటీపీ రంజిత్‌కుమార్, పీఈటీ భాస్కర్ తదితరులు అభినందించారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి



సదస్సును ప్రారంభిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వైరా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను ఎక్కువగా వినియోగించాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంతకుమార్ సూచించారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరితాదేవి, మధిర ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి, డాక్టర్ హేమంతకుమార్ మాట్లాడారు. వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృష్ణతేజ, శిరీష, ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చైతన్య, డాక్టర్ టి.పావని, పణిశ్రీ, తదితరులున్నారు.

'బెస్ట్ అవైలబుల్' పాఠశాలల విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు: డిప్యూటీ సీఎం

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదివే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల విద్యార్థుల సంక్షేమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలో చదివే షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగలకు చెందిన విద్యార్థుల సంక్షేమంపై ఆయా జిల్లాల కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, ఆరోగ్యం మెనూ ప్రకారం భోజనం, ఇతర మౌలిక వసతుల అమలుపై పాఠశాలలను సందర్శించి పరిశీలించాలని తెలిపారు. విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యాబోధన కొనసాగించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు శ్రీలత, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు, సంబంధిత అధికారులు తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇసుక కూపన్ల జారీలో అధికారుల హైడ్రామా..?

61 కూపన్లకు 5 కూపన్లలో లోపాలు

ఎనిమిది ట్రాక్టర్లను ర్యాంప్‌లో డంప్ చేయించిన పోలీసులు

ఆళ్లపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : ఆళ్లపల్లి మండలంలో ఇందిరమ్మ ఇంటికి కూపన్లు జారీ చేయడంలో మంగళవారం అధికారులు హైడ్రామా చేశారు. దొరికితే దొంగ లేదంటే దొరా.. అన్నట్టుగా, రాయిపాడు కిన్నెరసాని వాగు నుంచి ఇల్లెందు నియోజకవర్గానికి ఇసుక తీసుకేళ్లేందుకు మంగళవారం రెవెన్యూ కార్యాలయం నుంచి 61 కూపన్లు అధికారులు జారీ చేశారు. ఈ క్రమంలో రాయిపాడు కార్యదర్శి అందులో 56ట్రాక్టర్లకు కూపన్లు జారీ చేయగా 5 కూపన్లకు సరైన ఆధారాలు, పొంతన లేకుండా ట్రాక్టర్ల నంబర్లు నమోదు చేయడంతో రద్దు చేశారు. కాగా 8 ట్రాక్టర్లకు అదనంగా ఏ ఆధారం లేకుండానే రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఇసుకను లోడ్ చేయించి ఇల్లెందుకు తరలించేందుకు సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న పోలీస్, అటవీశాఖ సిబ్బంది రాయిపాడు ఇసుక ర్యాంప్ దగ్గరకు చేరుకుని పొంతన లేని 5 కూపన్లను రద్దు చేసి, ఎటువంటి ఆధారాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించేందుకు సిద్ధం చేసిన 8 ట్రాక్టర్ల ఇసుకను ర్యాంప్‌లో డంప్ చేయించారు.

రూ.2.96 కోట్లతో కళాశాలలకు మరమ్మతులు

కారేపల్లి అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 15 జూనియర్ కళాశాలల్లో రూ.2.96 కోట్లతో మరమ్మతు పనులను చేపడుతున్నట్లు ఖమ్మం ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కె.రవికుమార్ తెలిపారు. మంగళవారం కారేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరు శాతం పెరిగిందన్నారు. అదేవిధంగా హెచ్‌ఆర్‌ఎంఎస్ సీసీ కెమెరాలను అమర్చడం ద్వారా కళాశాల సిబ్బంది విధి నిర్వహణ పనితీరును, ఇంటర్మీడియట్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అనంతరం కళాశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులకు అండగా.. టూరిస్ట్‌పోలీస్



(5వ పేజీ తరువాయి)

ఇవ్వడంతో పాటు మార్గదర్శిగా నిలిచేందుకు టూరిస్టు పోలీసు అనే ప్రత్యేక పోలీసింగ్ విధానంను ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో ని వివిధ జిల్లాల నుంచి డిగ్రీ, పీజీ ఇతర ఉన్నత చదువులు చదివి తెలుగుతో పాటు ఆంగ్లం, హిందీలో నిష్ణాతులైన వారిని గుర్తించి 80 మందికి హైదరాబాద్‌లోని నిథమ్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంటు)లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పది మంది టూరిస్టు కానిస్టేబుళ్లు కలెక్టరేట్‌లో జిల్లా యువజన క్రీడల అధికారి పరందామరెడ్డికి రిపోర్టు చేశారు. బుధవారం నుంచి ఈ సిబ్బంది విధుల్లో నిమగ్నం కానున్నారు.

టూరిస్టు పోలీసుల ఎంపిక ఇలా

జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో డిగ్రీ, పీజీ, బీటెక్ చదివి తెలుగుతో పాటు హిందీ, ఆంగ్లంలో నిష్ణాతులైన వారిని గుర్తించి శిక్షణకు పంపారు. భద్రాచలం పట్టణ పోలీసు స్టేషన్, ట్రాఫిక్, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, లక్ష్మీదేవిపల్లి, ఆళ్లపల్లి, టేకులపల్లి తదితర పోలీసు స్టేషన్‌ల నుంచి పది మందిని హైదరాబాద్‌లోని నిథమ్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 80 మంది కానిస్టేబుళ్లకు టూరిస్టు పోలీసుల ప్రత్యేక శిక్షణ ఈ నెల 6 నుంచి 9 వరకు ఇచ్చారు. 10, 11 తేదీల్లో క్షేత్ర స్థాయిలో యాదగిరిగుట్ట, గోల్కొండ కోట, లుంబిని పార్కు, బోనగిరి, కుతుబ్‌షాహి సమాధులకు వద్దకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు.

పర్యాటకులకు రక్షణ, భద్రత భరోసాగా..

టూరిస్టు పోలీసులు బుధవారం నుంచి విధుల్లో చేరనున్నారు. ప్రసిద్ద పుణ్యక్షేత్రంగా, దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం, మరో పుణ్యక్షేత్రం పర్ణశాల, జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధిపొందిన కిన్నెరసానిల్లో టూరిస్టు పోలీసులు విధులు నిర్వహిస్తారు. భద్రాచలంలో ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక మహిళ కానిస్టేబుల్, పర్ణశాలలో ముగ్గురు కానిస్టేబుళ్లు, కిన్నెరసానిలో ఇరువురు కానిస్టేబుళ్లు, ఒక మహిళ కానిస్టేబుళ్లు విధులు నిర్వహించనున్నారు. వీరు దేశ విదేశాల నుంచి తరలి వచ్చే పర్యాటకులకు రక్షణ, భద్రత ఇవ్వడంతో పాటు వారు వెళ్లే పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలకు మార్గదర్శిగా నిలవనున్నారు. ఇదే సమయంలో పర్యాటక అతిథులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వారు వ్యవహరించనున్నారు. ఈ క్రమంలో తెలుగుతో పాటు హిందీ, ఆంగ్లభాషల్లో వారికి పరిస్థితిని వివరిస్తారు. ఇదిలా ఉండగా పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో చేయదగినవి, చేయకూడనివి ఏమిటి అనే వివరాలు సైతం వాటిపై అవగాహన కల్పించనున్నారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయనున్నారు. కాగా వీరికి డ్రస్‌కోడ్ సైతం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది.

యూనియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్‌గా ఆదివాసీ యువతి



సోడే లావణ్య

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని రాజుపేట కాలనీకి చెందిన ఆదివాసీ యువతి సోడే లావణ్య యూనియన్ బ్యాంకు అసిస్టెంటు మేనేజరు(క్రెడిట్) జేఎంజీఎస్-1 గ్రేడ్‌కు ఎస్టీ కేటగిరీలో ఎంపికైనట్లు అధికారిక సమాచారం వచ్చింది. 2025-26లో యూనియన్ బ్యాంకు రిక్రూట్‌మెంటు ప్రాజెక్టు స్పెషలిస్టు ఆఫీసర్ ఇతర పోస్టులకు నిర్వహించిన పరీక్షల్లో లావణ్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అసిస్టెంటు మేనేజరుగా ఎంపికైంది. తన సోదరుడు సోడే హరీష్ కర్ణాటక రాష్ట్రంలో సెంట్రల్ బ్యాంకులో పీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా లావణ్య తండ్రి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహించి మృతిచెందగా, తల్లి విజయ ఇరువురు పిల్లలను కష్టపడి చదివించారు. ఈ క్రమంలో స్థానిక ఆదివాసీ యువతకు ప్రేరణగా నిలుస్తున్న లావణ్యకు భద్రాద్రి ఆదివాసీలు అభినందనలు తెలియజేస్తున్నారు.

24 గంటల్లో విధుల్లో చేరకుంటే క్రమశిక్షణ చర్యలు

(5వ పేజీ తరువాయి)

జాబితాలను కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఉత్తర్వులను ధిక్కరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు. ఈ ఉత్తర్వులను దేవస్థానం ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. ఈ హెచ్చరిక ఉత్తర్వులు దేవస్థానం ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారి తీస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ స్థలాల్లో.. పామాయిల్

(5వ పేజీ తరువాయి)

జాతీయ రహదారులతో పాటు కొత్తగా నాగపూర్-అమరావతి రాబోతోంది. విజయాడ-జగదల్‌పూర్ జాతీయరహదారి కూడా ఉంది. రహదారులు జిల్లాలో వందల కిలోమటర్ల దూరంలో ఉన్నాయి. అలాగే పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి రహదారులున్నాయి. వీటి వెంట ఖాళీస్థలాలున్నా నీడకోసం పలురకాల మొక్కలు వేస్తున్నారు. అయితే ఆయిల్‌పామ్ మొక్కల వేయడం ద్వారా రోడ్లవెంట పచ్చదనం, పర్యావరణంతోపాటు రహదారులు ఆకర్షణీయంగా ఉండే అవకాశం ఉంది. దీనికితోడు బ్రిడ్జిల అప్రోచ్‌లు, రోడ్లు అప్రోచ్‌లు కూడా కిందకు జరగకుండా ఈ చెట్లు రోడ్ల అప్రోచ్‌లు, చెరువుకట్టకు సపోర్టుగా నిలవనున్నాయి. జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్‌కాలేజీలు, హైస్కూళ్లతోపాటు ఇతర విద్యాసంస్థల్లో కూడా ఖాళీ ప్రదేశాలున్నాయి. ఈప్రదేశాలు అన్యాక్రాంతమవుతున్నందున ప్రహరీల పక్కతో పాటు నిరుపయోగంగా ఉన్న ప్రదేశాల్లోనూ ఆయిల్‌పామ్ మొక్కలు నాటడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో గ్రీనరీతో పాటు ఆయిల్‌పామ్ మొక్కలతో ఆదాయం లభించనుంది. అలాగే జిల్లాలో అటవీ భూములు కూడా వేలాది ఎకరాల్లో ఖాళీగా ఉన్నాయి. కొన్నిచోట్ల జామాయిల్ లాంటి మొక్కలు వేస్తున్నారు. ఈ మొక్కలు వేయడం వల్ల భూసారం దెబ్బతింటుందన్న ప్రచారం ఉంది. జామాయిల్‌కు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ మొక్కలు అటవీభూముల్లో వేయించి తద్వారా పచ్చదనంతోపాటు అటవీశాఖకు ఆదాయం కూడా రానుంది. అలాగే రెవెన్యూభూములు, ఇతర ప్రభుతవ శాఖల భూములు చాలా చోట్ల ఖాళీగా ఉన్నాయి. వీటిలో కూడా సరిహద్దుల్లో చుట్టూ అయిల్‌పామ్ మొక్కలు వేయనున్నారు.

బహుళ ప్రయోజనాలు..

జిల్లాలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఖాళీస్థలాలు నిరుపయోగంగా ఉన్న అటవీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ భూముల్లో ఆయిల్‌పామ్ మొక్కలు వేయడం వల్ల ప్రభుత్వ వనమహోత్సవ లక్ష్యంతోపాటు పచ్చదనం అభివృద్ధి చెందనుంది. ఈమొక్కలు ద్వారా ప్రభుత్వానికి ఆయా ప్రభుత్వ శాఖలకు ప్రతీ ఏటా ఆదాయం లభించనుంది. దీనికితోడు జిల్లాలో నూనెగింజల ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగనుంది. జిల్లాలో ఉన్న అధిక ఉష్ణోగ్రతను ఆయిల్‌పామ్ మొక్కలు పెద్దఎత్తున పెంచడం ద్వారా వేసవిలో కొంత చల్లదనం పెంపొందించే అవకాశం కలగనుంది. ఎకరానికి 57 మొక్కలు వరకు ఆయిల్‌పామ్ కింద సాగుచేస్తున్నారు. ఈ పంటకు ప్రభుత్వ పెద్దఎత్తున సబ్సిడీ అందిస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేసి ఈ మొక్కలను ప్రభుత్వ స్థలాల్లో నాటించడం ద్వారా జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపెద్దఎత్తున జరగనుంది. ఉమ్మడిజిల్లాలో ఇప్పటికే లక్షా 20వేల ఎకరాల్లో సాగవుతోంది. మరో లక్ష ఎకరకాలపైగా ఆయిల్‌పామ్ సాగుచేయాలన్నది ఉద్యానశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. పెద్దఎత్తున జామాయిల్, సుబాబుల్ వంటి తోటలు సాగవుతున్నాయి. వీటికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌సాగును ప్రోత్సహించబోతున్నారు.

ఒక్కో మొక్కకు ఏటా రూ.2వేలనుంచి 5వేల ఆదాయం

ఆయిల్‌పామ్ మొక్క వేయడం ద్వారా ఉత్పత్తి మొదలయితే ఒక్కో మొక్క నుంచి రూ.2 వేల నుంచి రూ.5వేల వరకు ఆదాయం లభిస్తుందని, అంచనా. ప్రభుత్వస్థలాలు ఆయా శాఖల ఖాళీ భూముల్లో ఈ మొక్కలు వేయడం ద్వారా ప్రభుత్వ శాఖలకు కూడా ఆదాయం లభించనుంది. అటవీశాఖ వీఎస్ఎస్ కమిటీల్లా స్వయం సహాయక సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీలు, భూమిలేని వ్యవసాయకూలీల కమిటీలకు ప్రభుత్వ శాఖల పరిధిలో ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పచాయతీరాజ్ భూముల్లో ఆయిల్‌పామ్ మొక్కలు వేయించి వాటి సంరక్షణ, ఉత్పత్తి ద్వారా వారికికూడా అదనపు ఆదాయం సమకూర్చే అవకాశం ఉంది.

పర్యవేక్షణ మంచిదే... మరి ఆచరణ..!

12 పాఠశాలల బృందాల ఏర్పాటుకు సిద్ధం

ఇప్పటికే ఎంఈవోలు, హెడ్‌మాస్టర్స్, 161మంది పర్యవేక్షకులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల సరైన ఫలితాలు రావడంలేదని జవాబుదారితనం లేకపోవడంతో పర్యవేక్షణ కమిటీలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జిల్లాల్లో, మండలాల్లో మండల విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు పర్యవేక్షకులుగా ఉన్నారు. కొత్తగా విద్యాశాఖ పాఠశాలల పర్యవేక్షణ బృందాల ఏర్పాటు కోసం ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 1048 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 762 ప్రాథమిక, 162 ప్రాథమికోన్నత, 124 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 64,834 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో ఉండవలసిన ఉపాధ్యాయుల సంఖ్య కంటే అదనంగా 398 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, డిజిటల్ బోధన, ప్రయోగశాలలు, క్రీడా పరికరాలు, గ్రంథాలయాలు ఉన్నప్పటికీ విద్యార్థుల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంపై ప్రభుత్వ పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ప్రస్తుతం ఉన్న పర్యవేక్షకులు

జిల్లాలో 23మంది మండల విద్యాశాఖ అధికారులు 90కి పైగా స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు ఆయా మండలాల పాఠశాలలను తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు తనిఖీ వివరాలు అప్‌డేట్ చేస్తున్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలతో పాటు, కాంప్లెక్స్ పాఠశాలలకు చెందిన నివేదికలు, సమావేశాలకు మాత్రమే పరిమితం అవుతున్నారనే విమర్శలు లేకపోలేదు.



విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

నూతన కమిటీల ఏర్పాటు

జిల్లాలోని 1048 పాఠశాలలపై పర్యవేక్షణ కోసం 12 కమిటీలు ఏర్పాటు చేయబోతున్నారు. 100 పాఠశాలలకు ఒక 8 కమిటీలు, ప్రాథమికోన్నత పాఠశాలల కోసం రెండు కమిటీలు, ఉన్నత పాఠశాలల కోసం రెండు కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల కోసం ముగ్గురు ఉపాధ్యాయులతోను, ఉన్నత పాఠశాలల కమిటీలో తొమ్మిది మంది ఉపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను కమిటీలకు నాయకత్వం వహించనున్నారు. ఈ కమిటీల ఎంపిక బాధ్యతలు జిల్లా కలెక్టర్ నేతృత్వంతో ఏర్పడిన జిల్లా కమిటీ ఎంపిక చేస్తుంది. ఎంపిక విధి విధానాలపై ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.

కమిటీలు ఏం చేయాలి ?

100 పాఠశాలలను మూడు నెలల్లో పర్యవేక్షణలు చేయాలనే బాధ్యత కమిటీకి అప్పగించారు. తాము పర్యవేక్షణ చేసిన వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా అధికారికి పంపించాల్సి ఉంటుంది. ముఖ్యంగా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేయడం, బోధన విధానాలు, విద్యార్థుల ప్రతిస్పందనలు పరిశీలించాల్సి ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో భాషా, గణితాల అభివృద్ధి, ఉన్నత పాఠశాలల్లో అభ్యసన నైపుణ్యాల పరిశీలన, కనీస అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడం, ప్రయోగశాలల వినియోగం, పఠనాభివృద్ధి, అభ్యసనా పెరుగుదల తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. కమిటీ సభ్యులు బోధనా అనుభవం, పరిశీలనా పరిజ్ఞానం, సబ్జెక్టులపై పట్టు, నూతన అంశాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే విద్యార్థులకు సరైన న్యాయం జరుగుతుంది. కమిటీల ఏర్పాట్లు, పర్యవేక్షణలో అలసత్వం వహిస్తే నామ మాత్రంగానే పర్యవేక్షణలు జరుగుతాయి.

తల్లిదండ్రులు ఏం కోరుకుంటున్నారు?

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలు కలిగి ఉండాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రాథమికస్థాయి విద్యార్థుల్లో రాయడం, చదవడం, అవగాహన, ఆలోచనా సరళితో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేసే విధంగా విద్యార్థులను తయారు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో చదివే పిల్లలకు, భాషా సామర్థ్యాలు క్రమశిక్షణ, గణిత సామర్థ్యాలు, సొంత మాటలతో రాయడం, పరిశీలన, పరిశోధన, నూతన ఆలోచనలు కలిగి ఉండాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించడం
అందరి బాధ్యత

కలెక్టర్ జితేష్ వి పాటిల్
సమాజంలో చైతన్యం తీసుకురావాలని ఉపాధ్యాయులకు పిలుపు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నివారణలో ప్రతీఒక్కరూ భాగస్వామ్యం కావాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, ఎస్సీ ఈఆర్టీ ఆధ్వర్యంలో మంగళవారం పాత కొత్తగూడెంలోని ఆనందఖని పాఠశాలలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ సమాజం చైతన్యవంతంగా ఉన్నప్పుడు ఎలాంటి సామాజిక విద్రోహ చర్యలు జరగవని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి వారు అక్రమ రవాణాకు గురువతున్నారని, దీన్ని ప్రతీ ఒక్కరూ గమనించి, అరికట్టాలని కోరారు. ఈమేరకు విద్యార్థులను తల్లితండ్రులను చైతన్యవంతులు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతోమంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్యని అన్నారు. సమాజంలో ప్రజలతో, విద్యార్థులతో సన్నిహితంగా ఉంటూ వారికి అవగాహన కల్పించాలని, ముఖ్యంగా పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్‌లో ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జఠిలమైన సమస్య అని పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలన్నారు. సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఆర్థిక కారణాలతో పాటు సామాజిక కారణాలు దోహదం చేస్తాయన్నారు. విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అందరూ అవగాహన కలిగి ఉండి, పిల్లల్ని అప్రమత్తం చేయడం ద్వారా దీన్ని నిర్మూలించాలని, చట్టాలపై వారికి అవగాహన కలిగించాలని కోరారు. ప్రజ్వల కో ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించు కోవచ్చన్నారు. ప్రతీ రోజు ఎంతోమంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారని తెలిపారు. యువత పిల్లలు ఆకర్షణకు గురై పట్టణాలకు వచ్చి వ్యభిచార గృహాల్లో అమ్మబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 32 వేల మంది అమ్మాయిలను కాపాడడం జరిగిందని తెలిపారు. ఇందులో చిన్న పిల్లలు, యువతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. సైబర్ ట్రాఫికింగ్ ద్వారా ఈ అక్రమ రవాణా పెరిగి పోయింది ముఖ్యంగా విద్యార్థులు అవసరం అయినా యాప్స్ ద్వారా పర్సనల్ ఫోటోస్, వీడియోస్ పంపడం ద్వారా సెక్స్ ట్రాఫికింగ్‌కి గురవుతున్నారని వివరించారు. విద్యాశాఖ సెక్టోరియల్ కో ఆర్డినేటర్ ఏ.నాగరాజు శేఖర్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ చెన్నకేశవులు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలాజరుగుతుంది, బాధితురాలిపైన ఉండే ప్రభావాలు, సైబర్ అధారిత అక్రమ రవాణా, చట్టాలు డీఎం.ఎస్, ఐటీపీఏ, పోక్సో, పీసీఎంఏ, సఖీ, భరోసా, చైల్డ్ లైన్, పోలీస్ టోల్‌ఫ్రీ నెంబర్స్ 1098, 100, 181, 1930ల గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్య శృతి రిసోర్స్ పర్సన్ మౌలిక తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, తూనికలు- కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖాధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 2,38,177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉందని, అందులో సన్నరకం 2,02,862 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 35,315 మెట్రిక్ టన్నులు ఉంటాయని తెలిపారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 193 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలను వివరించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, సాధారణ గ్రేడ్ రకానికి రూ.2,369, సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500లు ప్రతి క్వింటాకు రూ.2,889 మద్దతు ధర నిర్ణయించబడిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్‌లు, తేమ కొలిచే యంత్రాలు, తూకపు పరికరాలు, గన్నీ సంచులు వంటి సదుపాయాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులకు టోకెన్ల వ్యవస్థ ద్వారా రద్దీ నియంత్రణ చేపట్టాలని, రైతు ఆధార్ కార్డుతో లింక్ అయిన మొబైల్ నంబర్‌కి వచ్చే ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పారు. గన్నీ సంచులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రైతులకు మాత్రమే ఇవ్వాలని, సంచులు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. మన జిల్లాకు పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకను నివారించేందుకు సరిహద్దుల్లో 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే, లేదా తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత ఇంచార్జ్‌లపై, మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతు ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో రావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎంఎస్‌పీ ధరలు, నాణ్యత ప్రమాణాలు, సంబంధిత అధికారుల వివరాలు, సన్న వడ్లు, దొడ్డు వడ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి స్పష్టంగా ప్రదర్శించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత గన్నీ సంచులకు ట్యాగ్, సెంటర్ నెంబర్ వేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు త్వరితగతిన తరలించాలన్నారు. సీఎంఆర్ 2025-26 రబీ సీజన్‌కి సంబంధించిన డెలివరీలను సకాలంలో పూర్తి చేసేలా రైస్ మిల్లులను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల అధికారి రుక్మిణి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాథ్‌బాబు, డీసీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి బాబురావు, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, తూనికలు -కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆనందరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ, శిశు సంక్షేమమే లక్ష్యంగా సేవలుండాలి

ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి


సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి

కల్లూరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) మహిళా, శిశు సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అంగన్వాడీ టీచర్లు పనిచేయాలని వరంగల్ రీజియన్ ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. కల్లూరులో సెక్టార్ సూపర్‌వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో కల్లూరు మున్సిపాలిటీ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన పోషణ మాసోత్సవ కార్యక్రమంలో ఆర్జేడీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అంగన్వాడీ కేంద్రంల్లో చిన్నారులకు ఆధునిక పద్ధతిలో విద్యను అందించేలా నూతన విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార లోపం సమస్యలు లేకుండా సేవలు అందించాలన్నారు. గర్భిణీగా గుర్తించిన వెంటనే అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకొని టీచర్లు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తూ, ఆరోగ్యశాఖ సహకారంతో వ్యాధి నిరోధక టీకాలు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ గర్భిణీలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకున్నట్లయితే రక్తహీనత సమస్య లేకుండా సుఖప్రసవం అవుతారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిల్లోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. స్థానిక వైద్యాధికారి వినీత్ మాట్లాడుతూ బిడ్డపుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చేవరకు తల్లిపాలనే ఇవ్వాలని, ఆరు నెలలు నిండిన తరువాత రెండు ఏళ్ల వరకు తల్లిపాలతో పాటుగా అదనపు ఆహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సీడీపీవో నిర్మల జ్యోతి, ఏసీడీపీవోలు రత్తమ్మ, నవ్యశ్రీ, సూపర్‌వైజర్లు సంధ్యారాణి, భవాని, వెంకటమ్మ, మునిసిపాలిటీ మేనేజర్ ఎన్.నాగేశ్వరరావుతో పాటుగా గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తెప్ప మీద తిప్పలుపడుతూ..

విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఉద్యోగుల సాహసం


తెప్ప మీద వెళుతున్న విద్యుత్ సిబ్బంది


చెరువులో ఉన్న స్తంభంపైకి ఎక్కుతున్న సిబ్బంది

పినపాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పండుగొచ్చినా, ప్రకృతి విపత్తొచ్చినా ఆ శాఖ ఉద్యోగులకు కంటి మీద కునుకుండదు. అందునా వర్షాకాలమైతే సిబ్బందిని తిట్టుకోని ఇల్లుండదు. భారీ వర్షానికి, గాలి దుమారానికి ఎక్కడ తీగలు తెగిపడ్డా కరెంటు సరఫరాలో ఏ చిన్న అంతరాయం ఏర్పడినా, ఒక్క నిమిషం ఆలస్యమైన వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులు, వివాదాలు అన్నీఇన్నీ కావు. అలాంటి విద్యుత్ శాఖలో విధులు నిర్వహించడమంటే కత్తిమీద సామే. సోమవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి మణుగూరు నుంచి ఏడూళ్ల బయ్యారానికి సరఫరా అయ్యే 33 కేవీ లైన్‌కు అంతరాయం ఏర్పడింది. సరఫరాలో ఎక్కడ సమస్య తలెత్తిందో కనిపెట్టే పనిలో ఏడూళ్లబయ్యారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఉద్యోగులు నిమగ్నమయ్యారు. ఇలా సమస్యను వెదుక్కుంటూ మణుగూరులో మూడు ప్రాంతాల్లో ఇన్సులేటర్లు ఫెయిల్ అయినట్లు వారు గుర్తించారు. కానీ ఆ సమస్య ఉత్పన్నమైన ప్రాంతం తిర్లాపురం, ఐలమ్మనగర్‌లోని చెరువు కావడంతో విధులు నిర్వహించేందుకు చెరువులోకి దిగాల్సి వచ్చింది. కానీ లోతు ఉండడంతో ఆ ప్రాంతానికి తెప్ప మీద వెళ్లి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ సరఫరా సమస్య పరిష్కరించేందుకు సాయంత్రం కావడంతో సిబ్బంది పడ్డ ఇబ్బందులను స్థానికులు గుర్తించి, అభినందించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది ఈ సంఘటన. లైన్‌మెన్ వెంకట్రావు, ఏఎల్ఎం కామేష్, స్వామి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కష్టపడ్డారు. ఏఈ వేణుగోపాల్, సబ్ ఇంజనీర్, ఎల్ఐ లు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ (పా)ను కలిసిన ఎస్సీ కమిషన్ సభ్యుడు


సింగరేణి డైరెక్టర్ (పా)ను కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిషనర్ బృందం

కొత్తగూడెం టౌన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రును తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణుగుంట్ల ప్రవీణ్ మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో సింగరేణి వ్యాప్తంగా అన్ని రీజనల్ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బిక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై చర్చించడంతో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లు అమలు, పదోన్నతులు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈసమావేశాలకు అవసరమైన విధి విధానాలను ప్రభుత్వం నుంచి సింగరేణి యాజమాన్యాని కి త్వరలో నివేదిక అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు, నాయకులు జమ్మిడి మల్లేష్, బందెల విజేందర్ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐ జిల్లా కోఆర్డినేటర్ ఎం. అన్వేష్ ఓ ప్రకటనలో కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచలో బాలుర రెసిడెన్షియల్, నవభారత్ పరిధిలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల్లో 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష రాసిన వారు, పరీక్ష రాయని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 17వ తేదీలోగా కులం, ఆదాయం ధృవీకరణ పత్రాలతో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వివరాల కోసం ఆయా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఏఎస్ఐ మృతి


విశ్రాంత ఏఎస్ఐ జగ్గారావు మృతదేహం

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఏఎస్ఐ మృతిచెందిన ఘటన ఏపీలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత ఏఎస్ఐ నార్లపాటి జగ్గారావు(63) ద్విచక్రవాహనంపై ఆంధ్రాలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలో గల మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో జల్లేరు సమీపంలో ఎదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నార్లపాటి జగ్గారావుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతిచెందిన జగ్గారావు అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. జగ్గారావు మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు. విశ్రాంత ఏఎస్ఐ మృతితో పేరాయిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'పది' ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత తప్పనిసరి

(5వ పేజీ తరువాయి)

నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల స్థితిగతులను తల్లిదండ్రులకు తెలియజేసి, ఇంటివద్ద ఎలాంటి చర్యలు తీసుకోవాలో వారికి వివరించాలని కోరారు. గతంలో తెలిపిన విధంగానే పాఠశాలలో ఆరు రకాల మొక్కలను పెంచి వాటిపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తే వారు తల్లిదండ్రులకు తెలియజేయడానికి వీలు కలుగుతుందన్నారు. బోధన విషయంలో విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా ఉపాధ్యాయులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణంలో పరిశుభ్రత పాటించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా మధ్యాహ్న భోజన విషయంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ.. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు పాస్ కావడానికి యాక్షన్ ప్లాన్ సబ్జెక్టుల వారీగా రూపొందించుకుని అమలు చేయాలన్నారు. పరీక్షల ముందు విద్యార్థులపై ఎలాంటి మానసిక ఒత్తుళ్ల లేకుండా ఆనందాయకమైన వాతావరణంలో బోధన జరగాలన్నారు. పర్యవేక్షణ కమిటీలను త్వరలో వేసి, సరైన ఫలితాలు రాబట్టే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.కాలం నిర్ణయ పట్టిక ప్రకారం సిలబస్ పూర్తిచేసి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి తగిన ప్రణాళికను పాఠశాల వారీగా రూపొందించుకుని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్. మాధవరావు, జిల్లా సెక్టోరియల్ కో ఆర్డినేటర్లు, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను మరింత ఉధృతం చేస్తాం

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు
రెండో రోజుకు చేరుకున్న డైలీవేజ్ కార్మికుల సమ్మె
నేటితో ముగియనున్న 72 గంటల నిరసన


ప్రసంగిస్తున్న మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డైలీవేజ్ కార్మికుల డిమాండ్లను అంగీకరించి సమస్యను పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న 72 గంటల నిరవధిక సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్, ఆదివాసీ సంఘాల నాయకులు ధర్నా శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటూ గిరిజన కార్మికుల నోటికాడి కూడును లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం త్వరలో స్పందించి సమస్యకు పరిష్కారం చేయకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన కనీస వేతన హక్కుని, పనిభద్రత హక్కుని ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ప్రభుత్వం సరైన పద్ధతుల్లో స్పందించి సమ్మెకు పరిష్కార మార్గం చూపాలన్నారు. న్యాయమైన డిమాండ్లతో పోరాటం చేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి విజయ్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనరు ఆకోజు సునీల్, ఆదివాసీ సీనియర్ నాయకులు పూనెం వీరభద్రం, ఆదివాసీ సమితి అధ్యక్షుడు పూనెం కృష్ణ, నాయకులు పాయం రవివర్మలు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే స్పందించి వారి డిమాండ్లను ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి బ్రహ్మాచారి, జేఏసీ నాయకులు హీరాలాల్, పాండా మంగమ్మ, గిరివజ స్వామి ముత్తయ్య, ఈశ్వర్, నాగేశ్వరరావు, జలందర్ పాల్గొన్నారు.

నేటితో 72 గంటల నిరసన ముగింపు

రెండ రోజుల క్రితం ఐటీడీఏ ఎదుట ఆరంభమైన 72 గంటల నిరసన బుధవారంతో ముగియనుంది. 33 రోజులుగా ఉమ్మడి జిల్లాలోని 33 పోస్టు మెట్రిక్ వసతి గృహాలకు చెందిన 135మంది, 81 ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు చెందిన 490మంది సమ్మెలో ఉన్నారు. ఐటీడీఏ ఎదుట సమ్మె నిర్వహిస్తున్న సమయంలో వర్షం వచ్చినా అక్కడ నుంచి వారు కదలకుండా ఉండటంతో భద్రాచలం సీఐ నాగరాజు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ అశోక్‌కుమార్‌లు జేఏసీ నాయకులకు నచ్చజెప్పి రాత్రి సమయంలో గిరిజన భవన్‌లో విశ్రాంతి తీసుకునేలా కోరారు. అలాగే భోజనాల కోసం వంటావార్పు అక్కడే నిర్వహిచారు. ఇదిలా ఉండగా బుధవారం ఐటీడీఏ పీవో బి.రాహుల్, జేఏసీ నాయకులతో భేటీ కానున్నట్లు సమాచారం.

కారు బ్యానెట్‌లో గంజాయి ప్యాకెట్లు

- పాల్వంచ వద్ద చెలరేగిన మంటలు
- ఆర్పేందుకు సర్వీసింగ్ సెంటర్ వెళ్లిన వైనం
- సిబ్బంది సమాచారంతో పట్టుకున్న పోలీసులు
- కారును వదిలేసి పరారైన అక్రమార్కులు



పాల్వంచ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కారు బ్యానెట్‌లో గంజాయినా తరలిస్తుండగా.. మార్గం మధ్యలో ఆ కారులో నుంచి మంటలు చెలరేగడంతో గంజాయి గుట్టు బయటపడింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచలో మంగళవారం ఈ ఘటన జరగ్గా.. స్థానికంగా సంచలనం రేపింది. పాల్వంచ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గురు గర్తు తెలియని వ్యక్తులు కారు బ్యానెట్‌లో గంజాయి ప్యాకెట్లు పెట్టుకుని భద్రాచలం నుంచి కొత్తగూడెం వైపు బయలుదేరారు. మార్గమధ్యలో పాల్వంచ దమ్మపేట సెంటర్‌కు చేరుకునే ఇంజన్ వేడెక్కి అందులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో కారులో ఉన్న గంజాయి రవాణా బ్యాచ్ కారు నిలిపి పరిశీలించారు. అనంతరం మంటలను అదుపు చేయాలనే ఉద్దేశంతో పక్కనే ఉన్న వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పెట్టి నీటిని బ్యానట్‌పై చల్లించారు. ఈ క్రమంలో సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేసే వారు కారు బ్యానెట్‌ను తెరవగా.. అందులో గంజాయి ప్యాకెట్లు కాలుతుండటం, గంజాయి వాసన రావడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ లోపు విషయం తెలుసుకున్న గంజాయి బ్యాచ్ అక్కడనుంచి పరారయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును స్వాధీనం చేసుకుని పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాల్వంచ టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు. అయితే గంజాయి ప్యాకెట్లు కాలిపోవడంతో అందులో ఎంత తరిస్తున్నారన్న దానిపై స్పష్టత లేదు.

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు



మావోయిస్టుల లొంగుబాటు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81,141 బెటాలియన్ అధికారులు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతతో మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట ఆరుగురు మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో బీజాపూర్ జిల్లాకు చెందిన మిలీషియా కమాండర్ పడ్డం లక్మా, సీఎన్ఎం కమాండర్ దొడ్డి బుద్రు, పార్టీ మెంబర్లు లేఖం బండి అలియాస్ శాంతి, మడవి కోసా, మిలీషియా మెంబర్ మడవి లక్మా, సుక్మా జిల్లాకు చెందిన పార్టీ మెంబర్ కుంజం పాపారావు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున రూ.1.50 లక్షలను ఎస్పీ అం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఆపరేషన్ చేయూతలో భాగంగా 326మంది మావోయిస్టులు లొంగిపోయినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ సరెండర్ పాలసీకి అనుగుణంగా పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మావోయిస్టుపై నమ్మకంతోనో, భయంతోనో వారికి సహకరించొద్దని ఆయన ఆదివాసీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

44.6 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ఏడుగురి అరెస్టు


పట్టుబడిన గంజాయితో నిందితులు

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం నెల్లిపాక రహదారిలో ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించగా మంగళవారం 44.6 కేజీల ఎండు గంజాయి పట్టుబడింది. ఈ సందర్భంగా మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోగా ఏడుగురిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ కె.తిరుపతి ఆధ్వర్యంలో ఎస్సై సీహెచ్ శ్రీహరిరావు, సిబ్బంది భద్రాచలం నెల్లిపాక రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద అనుమానాస్పదంగా ఒకదాని వెనుక ఒకటి వస్తున్న మూడు ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఇందులో 44.6 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. ఈ గంజాయిని సూర్యాపేట జిల్లాకు చెందిన బానోతు మహేష్, గుగులోతు అశోక్, బెంగుళూరుకు చెందిన రిజ్వాన్ పాషా, ఇమ్రాన్‌పాషా, మంజునాథ్, కేశవ్‌లు తరలిస్తున్నట్లు గుర్తించారు. వీరు ఒడిశాలోని మల్కనగిరి, సీలేరు నుంచి హైదరాబాద్ బెంగుళూరుకు గంజాయిని తరలిస్తూ పట్టుబడినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మూడు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేయగా పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా బూర్గంపాడు మండలం సారపాక ఇరవెండిలో అక్రమ నాటుసారా అమ్మకాలపై దాడులు నిర్వహించగా 113 లీటర్లు నాటుసారా, 600లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సమయంలో మూడు సెల్‌ఫోన్లు, 9 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు కేసుల్లో నిందితులను వారు తరలిస్తున్న వాటిని భద్రాచలం ఎక్సైజు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ, ఎస్సైలతో పాటు హెడ్ కానిస్టేబులల్లు కరీం, బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, హరీష్, విజయ్, వీరబాబు ఉపేందర్ పాల్గొన్నారు.



జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి: పీవో

మణుగూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు మెదక్ ఇంటిగ్రేటెడ్ కన్స్యూమర్ గూడ్స్ తయారీ, లాజిస్టిక్ (ఐసీఎంఎల్) గండపల్లి మెదక్ సంయుక్త సహకారంతో మణుగూరు ఐటీఐ సారధ్యంలో బుధవారం నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగంచేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి రాహుల్ తెలిపారు. ఇంటర్ ఒకేషనల్, ఐటీఐ చేసి వయస్సు 18 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల ఉన్న వారు మిషన్ ఆపరేటర్ పోస్టులకు ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు. మొత్తం 40 మందికి ఈ అవకాశం ఉందని, ఆసక్తి గల వారు ఈ నెల 15న మణుగూరు ఐటిఐ ఆవరణలో జరిగే ఈ జాబ్ మేళాలో పాల్గొనాలని తెలిపారు.

జాతీయస్థాయికి ఎంపికైన చిన్నారికి సత్కారం

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చెస్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అశ్వారావుపేటకు చెందిన చిన్నారిని ఘనంగా సత్కరించారు. పేటకు చెందిన కేశిబోయిన భవ్యశ్రీ లక్ష్మీ అనే విద్యార్థిని నాలుగు రోజుల క్రితం హైదరాబాదులో జరిగిన చెస్‌పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైంది. వివిధ రాష్ట్రాలకు చెందిన చెస్ ఆటగాళ్లు పాల్గొన్న పోటీల్లో భవ్యశ్రీ ప్రతిభను కనబరిచింది. ఈనేపధ్యంలో మంగళవారం అశ్వారావుపేట ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నారిని ఘనంతా సత్కరించారు. చిన్నారికి మొక్కను అందించి అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు రంజాన్, కార్యదర్శి పవన్, సీనియర్ ఫోటోగ్రాఫర్స్ వార రాము, షేక్ షఫీ, తడికమళ్ల అభి, ఆంజనేయుతో పాటు పలువురు పాల్గొన్నారు.

వర్మికంపోస్ట్‌తో అధిక దిగుబడులు

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలలో ఉత్పత్తి అయ్యే చెత్త నుంచి తయారుచేసుకునే వర్మికంపోస్ట్ ఎరువులను పంటలలో వినియోగించటం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యాన కళాశాల విద్యార్థులు సూచించారు. మండలంలోని నారంవారిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మోజర్ల ఉద్యాన కళాశాలకు చెందిన విద్యార్థులు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు కృష్ణనాయక్, వంశీ, నగేశ్, ధర్మతేజ, సురేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: కమిషనర్

అశ్వారావుపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీలో సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. మోడల్‌కాలనీని మంగళవారం ఆయన సందర్శించారు. కాలనీలోని రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యంను పరిశీలించారు. కాలనీలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మిండా హరిబాబు, నాయకులు తగరం ముత్తయ్య, నార్లపాటి కాంతారావు, నార్లపాటి దివాకర్, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా పర్ణశాల రాముని కల్యాణం

దుమ్ముగూడెం అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. తిరుమంజనం, నూతన వస్త్రాలంకరణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మంగళాష్టకాలు, మహాసంకల్పం, మాంగల్యపూజ, మాంగల్యధారణ, మంత్రపుష్పకార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఇంచార్జి అనీల్‌కుమార్, ముఖ్య అర్చకులు భార్గవాచార్యులు, విష్ణువర్ధనాచార్యులు, వెంకటాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బెక్కంటికి ప్రశంసాపత్రం



దుమ్ముగూడెం అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నరసాపురం ఎస్ఎన్ఏఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బెక్కంటి శ్రీనివాసరావుకు రాష్ట్ర పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ మంగళవారం హైదరాబాదులోని తన కార్యాలయంలో ప్రశంసా పత్రాన్నందించడంతోపాటు సన్మానించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా నిధులను సమీకరించి పాఠశాలలోని పలు అభివృద్ధి పనులను జరిపించడం వెనుక ఆయన కృషిని ప్రశంసించారు. పదోతరగతిలో వందశాతం ఫలితాలు సాధించడం పట్ల అభినందించారు.

సింగరేణి ఏరియా ఆసుపత్రి

సమస్యలు పరిష్కరించండి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మణుగూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మణుగూరు ఏరియాలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించింది. ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ మాట్లాడుతూ.. ఏరియా ఆసుపత్రిలో కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు సరైన వైద్య సేవలు అందటం లేదన్నారు. దీంతో కార్మికులు ఎన్నో ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ఆసుపత్రి కేవలం రిఫరల్ ఆసుపత్రిగా ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ గా మాత్రమే పనిచేస్తుందని ఆరోపించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవో జ్యోతిర్మయి కి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామనర్సయ్య, మేకల ఈశ్వర్, దాట్ల సందీప్, శనిగరపు కుమార స్వామి, సాయి ప్రకాష్ చారి, బి రవికుమార్, శ్రీనివాసరావు, ఆంథోని రవి, రత్నం, శివకుమార్, రామారావు, దండు విజయ్ కుమార్, నరహరి రవిశంకర్, ఎల్ కార్తీక్, ఎం కోటేశ్వరరావు, చొప్ప సుధాకర్, విఆర్ఎం రెడ్డి సురేష్, త్రినాద్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం కదలిరావాలి

అశ్వారావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకోసం బీసీలంతా పార్టీలకతీతంగా కదలిరావాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం అశ్వారావుపేటలో బీసీ సంఘాలు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి ఐక్య వేదికగా ఏర్పాటు చేసుకున్నారు. బీసీ రాష్ట్ర సంఘాలు పిలుపుమేరకు ఈనెల 18న బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్ సాధన కోసం చేపట్టే రాష్ట్ర బంద్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కురిశెట్టి నాగబాబు, ఉపాధ్యాయుల ప్రకాశరావు, పకీరయ్య, చిన్నంశెట్టి సత్యనారాయణ, లింగిశెట్టి వెంకటేశ్వరరావు, తాళం సూరిబాబు, అంకోలు వెంకటేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, బుచ్చిబాబు, పేరం నాగబాబు, డేరంగుల ప్రసాద్, ఆళ్ళ సత్తిబాబు, సోమని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి: సీపీఐ

మణుగూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరు పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆటో యూనియన్ సురక్షా బస్టాండ్ అడ్డా ఏఐటియూసీ మహాసభ రాయల భిక్షం అధ్యక్షతన జరుగగా పుల్లారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్ఎన్ రాజు, కార్యదర్శిగా మందారి పుల్లయ్య, గౌరవ అధ్యక్షులుగా చారి ఎన్నిక కాగా ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు నాయకులు కొత్తపల్లి సీతారాములు, తోటరమేష్, చారి, సతీష్, సత్యనారాయణ, ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో యూరియా కొరత

● ఇబ్బందులు పడుతున్న కరకగూడెం రైతులు ● పట్టించుకోని అధికారులు

కరకగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం సబ్ సెంటర్‌లో కొన్ని రోజులుగా యూరియా కొరత ఉంది. యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతి రోజు ప్రాథమిక సహకారి సంఘం సబ్ సెంటర్ వద్దకు యూరియా కోసం వచ్చి సబ్ సెంటర్ మూసి ఉండటంతో వెనుతిరిగి పోతున్నారు. రైతుల వరి పైర్లకు యూరియా సమయానికి వేయలేక పోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా కోసం సుమారు 15 కిలోమీటర్ల నుంచి రైతులు వచ్చి పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రాథమిక సహకార సంఘం సబ్ సెంటర్‌లో యూరియా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రాథమిక సహకార సంఘం సబ్ సెంటర్ అధికారి చందా కాంతారావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఐదు రోజుల నుంచి యూరియా అందుబాటులో లేదు. రేపటి వరకు యూరియా అందుబాటులోకి తీసుక వచ్చి రైతులకు అందిస్తామన్నారు.

ప్రాణాలు పోతేగానీ పట్టించుకోరా?

కల్వర్టును పరిశీలించిన కొత్తగూడెం ఆత్మకమిటీ మాజీ చైర్మన్ వీరయ్య

సుజాతనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలు పోయేదాకా కుంగిన కల్వర్టును పట్టిచ్చుకోరా? అని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, కొత్తగూడెం ఆత్మకమిటీ మాజీ చైర్మన్ బత్తుల వీరయ్య ప్రభుత్వ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సుజాతనగర్-సీతంపేట రహదారి ఎదుళ్లవాగు వంతెన ముందర కుంగిన కల్వర్టును బీఆర్ఎస్ నాయకులతో కలసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సుజాతనగర్-సీతంపేట రహదారి ఎదుళ్లవాగు వంతెన ముందర మూలమలుపు వద్ద కల్వర్టు కుంగి ప్రమాద భరితంగా మారినా అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని, లేని ఎడల ప్రభుత్వ కార్యాలయాల వద్ద దశాల వారీ ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిట్లూరి సుధీర్ కుమార్, రాములు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందుల్ని పట్టించుకోని ప్రభుత్వం

దుమ్ముగూడెం అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం నుంచి భద్రాచలం వరకు వంద కిలోమీటర్ల ప్రధాన రహదారి ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రాష్ట్రప్రభుత్వం చోద్యం చూస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. ములకపాడు సీపీఎం కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమస్యపై సీపీఎం 12 కిలోమీటర్ల పాదయాత్ర చేసి సబ్-కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా ఎటువంటి ప్రయోజనం కనబడలేదన్నారు. సమస్య పరిష్కారానికి నియోజకవర్గ ఎంపీ, ఎమ్మెల్యేలు కృషి చేయకపోవడంతో పరిస్థితి ఇంకా దిగజారిందన్నారు. భవిష్యత్ పోరాటాల దిశగా ఈనెల 16న భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాల అఖిలపక్ష పార్టీలు, ఆదివాసీ, దళిత, సామాజిక, ప్రజాసంఘాల సమావేశం నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు ఎ.కనకయ్య, ఏజే.రమేష్, వై.రవికుమార్, కారం పుల్లయ్య, ఆర్.శ్రీనివాస్, వై.వంశీకృష్ణ జి.స్వామి, గంగ, శరత్, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి వైద్యం కోసం ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

ఇల్లెందుటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న చిన్ననాటి మిత్రుడికి ఆర్థిక సాయం చేసి చేయుతనందించారు. ఇల్లెందు మండలం ని జాంపేట గ్రామానికి చెందిన మాడె రాము కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తూ చికిత్స పొందుతున్నాడు. హైదరాబాద్‌లో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సను పొందుతున్న రాముకు ముకుందాపురం హైస్కూల్ 2001-02 పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ మిత్రుడికి మంగళవారం హైదరాబాద్‌లో రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించి దాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ స్నేహితులు ఆర్‌వీ చారి, తోకల రమేష్, వ్యాపారవేత్త ప్రదీప్ తదితరులున్నారు.

సరస్వతీ నిలయాలుగా గ్రంథాలయాలు

గ్రంథాలయానికి వాటర్ ప్యూరీఫైయర్ వితరణ

ఇల్లెందుటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలుగా విజ్ఞానాన్ని అందించాలని కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పన చౌదరి అన్నారు. మంగళవారం ఇల్లెందు గ్రంథాలయానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరీఫైడ్ అందించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో శ్రమపడి ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థులందు ఖాళీ సమయంలో గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ రుక్మిణి, ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ రూప్లా నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు సన్ని తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీపీఐ నాయకురాలి మృతి

జూలూరుపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటనర్సాపురం గ్రామానికి చెందిన సీపీఐ నాయకురాలు ఇంగలపూడి వెంకటరమణ (50) మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర నాయకుడు చంద్ర నరేంద్రకుమార్ అన్నారు. అనారోగ్యంతో ఆమె మంగళవారం మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని సీపీఐ నాయకులు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు సతీమణి వెంకటరమణ అకాల మరణం బాధాకరమని అన్నారు.

రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత

ఇల్లెందురూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో ఇటీవల మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.20లక్షల బీమా చెక్కును ఎస్‌బీఐ అధికారులు మంగళవారం అందజేశారు.ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన పరిటాల పుల్లయ్య మూడు నెలల క్రితం పొలం వద్ద పిడుగుపాటుతో మృతి చెందాడు. మృతుడు పుల్లయ్య ముకుందాపురం ఎస్‌బీఐ బ్రాంచ్ నందు రూ.వేయి పర్సనల్ ఇన్సూరెన్స్ చెల్లించడంతో ఆ నగదును మృతుడి భార్య లలితకు ఎస్‌బీఐ రిజినల్ మేనేజర్ సత్యనారాయణ, బ్రాంచ్ మేనేజర్ శివశంకర్ చెక్కు రూపంలో మంగళవారం బ్రాంచ్ నందు అందజేశారు. ఎస్‌బీఐ ఖాతాదారుల కుటుంబాలకు భద్రత, భరోసా కల్పించడంలో ముందుంటుందని రిజినల్ మేజేజర్ సత్యనారాయణ తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం: డీఈ

దమ్మపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు లోవోల్టే సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నట్లు విద్యుత్ డీఈ నందయ్య అన్నారు. పార్కలగండి గ్రామంలో పొలం బాట కార్యాక్రమాన్ని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. విద్యుత్ మోటర్లు మోటర్లను పరీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖా ద్వారా సమస్యలను అధిగమించి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైతులు మోటర్లకు అదనపు విద్యుత్ వాడకం వల్ల మోటర్లు కాలిపోవటంతో పాటు లోవోల్టే సమస్యలు తలెత్తుతాయని అదనపు విద్యుత్ కావాలంటే సంబందిత అధికారులకు దరఖాస్తు చేసుకుంటే నిబందనల ప్రకారం అదనపు లోడు మంజూరు చేస్తామన్నారు. ప్రతి రైతు తమ మోటర్లకు కెపాసిటరన్లు అమర్చుకోవాలని, ఆటో స్టాటర్ల వినియోగం తగ్గించాలని రైతులను కోరారు. కార్యక్రంలో రైతులు కొయ్యల అచ్యుతరావు, మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాదు, శ్రీను, అధికారులు ఏడీఈ వెంకటరత్నం, సబ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

మణుగూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పోలీసు స్టేషన్‌ను ఎస్పీ రోహిత్ రాజ్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీచేశారు. స్టేషన్‌లో అధికారులు, సిబ్బందితో వారి పనితీరుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల కాలంలో జరిగిన ఏసీబీ దాడులు వాటి పర్యవసానాలు, అస్తవ్యస్తంగా మారిన స్టేషన్ పనితీరుపై ఎస్పీ తీవ్ర స్థాయిలో మండిపడ్డట్టు తెలిసింది. స్టేషన్‌లో నిర్వహించిన సమావేశం అనంతరం ఎస్పీ ఆగ్రహంతో ఎలాంటి ప్రెస్ రిలీజ్ చేయకుండా కొత్తగూడెం వెనుతిరిగారు.

ఆదివాసీలకే భద్రాచలం కేటాయించాలి

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సర్పంచ్ అభ్యర్థిని 1874 డిస్ట్రిక్ట్ యాక్టు ప్రకారం స్థానిక ఆదివాసీలనే సర్పంచ్ అభ్యర్థిగా కేటాయించాలని గోండ్వాన సంక్షేమపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ ఆవరణలో కోండ్రు సుధారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాచలం అంటేనే ఆదివాసీల సమూహం, పోరుగడ్డ అని రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో భద్రాచలం సర్పంచ్ స్థానంకు ఆదిమ జాతుల అభ్యర్థులను బరిలోకి దింపాలని రాజకీయ పార్టీలకు స్పష్టం చేశారు. అలా కాకుండా వలస వచ్చిన అభ్యర్థులను పోటీలో నిలబెడితే ఆదివాసీలందరూ ఐక్యంగా ఉండి ఓటమి రుచి చూపిస్తారని అన్నారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

▸▸ విద్యుత్ వినియోగదారుల సదస్సు చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలా చారి ▸▸ నేడు సుజాతనగర్‌లో నిర్వహణ

సుజాతనగర్/జూలూరుపాడు/చంద్రుగొండ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ వినియోగదారుల సదస్సు చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలా చారీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుజాతనగర్ మండలంలోని విద్యుత్ ఉప కేంద్ర కార్యాలయ ఆవరణలో బుధవారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటుచేసినట్లు టీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్ తెలిపారు. ఈ లోకల్ కోర్టులో కాలిపోయిన ట్రాన్సాఫార్మర్లు మార్చటం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదన పు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకాని కన్న హెచ్చు మొత్తంతో గల బిల్లులు, కేటగిరీ మార్పు, సర్వీస్ రద్దు మొదలగు వాటికి సంబంధించిన విద్యుత్ వినియోగదారులు రాత పూర్వకంగా తమ ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదులు ఉదయం గం.10.30 నుంచి మధ్యాహ్నం గం.1.00 వరకు స్వీకరింపబడునని దీనిని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూలూరుపాడు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి బుధవారం సుజాతనగర్‌లోని సబ్‌స్టేషన్ కార్యలయ ఆవరణలో సీజీఆర్ఎఫ్ ఫోరం అధ్వర్యంలో విద్యుత్ సదస్సును నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ ప్రవీణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చంద్రుగొండ: మండల పరిధిలోని విద్యుత్ వినియోగ దారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సుజాతనగర్ సబ్‌స్టేషన్‌లో బుధవారం సీజీఆర్ఎఫ్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సున చంద్రుగొండ మండల వినియోగదారులు వినియోగించు కోవాలని ఆశాఖ స్థానిక ఏఈ నరసింహారావు మంగళవారం తెలిపారు.